# తొలివెలుగు
జాతీయ దినపత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 181 | శుక్రవారం | 17-7-2026

PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ


94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి..

- భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి
- త్వరలో 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'కు రూపకల్పన
- పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు
- నిరర్థక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం



రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468

2లో



## నీటిపారుదల రంగాన్ని నాశనం చేశారు

- బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ధ్వజం
- దేవాదుల, ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి పూర్తి చేస్తాం
- వారంలో సీఎంతో కలిసి మహారాష్ట్ర పర్యటన
- వైఎస్ ప్రారంభించిన ప్రాజెక్టు పూర్తికి అక్కడి సీఎంతో చర్చిస్తాం
- 'సీతారామ'పనులు పరిశీలించిన భట్టి, ఉత్తమ్, పొంగులేటి

2లో

భద్రాద్రి కొత్తగూడెం: బీఆర్ఎస్ హయాంలో నీటిపారుదల రంగంపై చేసిన అట్టహాసాలతో లక్షలాది ఎకరాలకు నీళ్లు తెచ్చారనుకుంటే... ఆ రంగాన్ని సర్వనాశనం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. రూ.1.8 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా సీతారామ, సీతమ్మ సాగర్, దేవాదుల వంటి ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని వారు పరిశీలించారు. అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బరాజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులతోపాటు సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులను

## బాబు రాష్ట్రానికి క్యాన్సర్ గడ్డ.. జగన్ రాయలసీమ రత్నం

- జగన్ ను విమర్శించడమే చంద్రబాబు, లోకేశ్ ఏకైక పనిగా పెట్టుకున్నారన్న రాచమల్లు
- లోకేశ్ కడప జిల్లా పర్యటన వల్ల ఒరిగిందేమీ లేదని ఎద్దేవా
- అమరావతి రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని మండిపాటు



2లో



## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు..

### ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

2లో



## రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

- జగన్ అధ్యక్షతన వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం
- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్
- ప్రభుత్వ భూములను దోచిపెడుతున్నారని మండిపాటు
- అమరావతిలో చదరపు అడుగుకు రూ. 20 వేలకు పైగా ఖర్చు చూపిస్తున్నారని ఆరోపణ
- ప్రతి రంగంలో మాఫియా రాజ్యమేలుతోందని విమర్శ

వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేసిన జగన్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉభయ సభల్లో గళం విప్పాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసీపీ మద్దతుగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోటీ పరీక్షలు నిర్వహించకుండానే డీఎస్సీ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే ఒక పెద్ద స్కామ్ అని ఆరోపించారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో తీవ్రమైన అవకతవకలు

మిగతా 2లో



## ఏపీలో ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల...

- తల్లికి వందనం' పథకానికి రూ.10,120.78 కోట్లు మంజూరు
- 42.70 లక్షల మంది తల్లులు, 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకు రూ.15,000 ఆర్థిక సాయం
- పాఠశాల నిర్వహణ కోసం రూ.2,000 మినహాయింపు, తల్లి ఖాతాలో రూ.13,000 జమ
- 2026-27 విద్యా సంవత్సరానికి పథకం అమలుకు ఉత్తర్వులు

2లో

## చీకట్లలో తెలంగాణ.. కమీషన్లలో కాంగ్రెస్

- రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం
- బొగ్గు, నీటి నిర్వహణలో నిర్లక్ష్యంతో అప్రకటిత కరెంట్ కోతలు
- రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ ఉద్యమం





## 21న ఎన్‌డీఏ కీలక సమావేశం

- మంత్రివర్గ విస్తరణ, పార్లమెంట్‌లో చర్చించాల్సిన అంశాలే ఎజెండా
- ప్రతిపక్షాల విచ్ఛిన్నతను అనుకూలంగా మార్చుకోవడంపైనా చర్చ
- నేడు ఎన్‌డీఏ మంత్రుల సమావేశం

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి..

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఈ పథకం అమలు, మార్గదర్శకాల కోసం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం జీవో నెం.15, జీవో నెం.16 జారీ చేశారు. ఈ పథకం కోసం రూ.10,120.78 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 42,70,802 మంది తల్లులకు, వారి 67,47,190 మంది పిల్లలకు లబ్ధి చేకూరనుంది. జులై 22వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ చేయనున్నారు. విద్యార్థుల్లో డ్రాపౌట్లను తగ్గించి, వారి చదువులో తల్లుల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. గత విద్యా సంవత్సరం (2025-26) నుంచి అమలవుతున్న ఈ పథకం కింద, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలను బడికి పంపుతున్న ప్రతి తల్లికి, వారి పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఒక్కో బిడ్డకు ఏటా రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు..



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

## నీటిపారుదల రంగాన్ని నాశనం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించి సమీక్షించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల అంచనాలను రీడిజైన్ పేరుతో భారీగా పెంచడమే కాక ప్రజాధనాన్ని దుర?వినియోగం చేస్తూ దోపిడీకి పాల్పడిందని మంత్రి ఉత్తమ్ చెప్పారన్నారు. దివంగత వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఖమ్మం జిల్లాలో ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ దుమ్ముగూడెం ప్రాజెక్టులను కేవలం రూ,3,505 కోట్లతో నిర్మించి 4 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించేందుకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు చేపట్టారన్నారు. మరో రూ.1,505 కోట్లతో మిగిలిన పనులు చేపట్టాల్సి ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టి, సీతారామ ప్రాజెక్టుగా మార్చి రూ. 24వేల కోట్లకుపైగా వ్యయాన్ని పెంచిందని దుయ్యబట్టారు. ఆ పార్టీ గద్దె దిగే నాటికి రూ.8 వేల కోట్లు ఖర్చు చేసినా జిల్లాలో కొత్తగా ఎకరం కూడా ఆయకట్టు తేలేకపోయారని విమర్శించారు. 2004లో మొదలైన దేవాదుల ప్రాజెక్టును కూడా తమ హయాంలోనే పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం వారం రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మహారాష్ట్ర వెళ్లి అక్కడి సీఎంతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై చర్చలు జరుపుతామన్నారు.

# 21న ఎన్‌డీఏ కీలక సమావేశం



న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్న నేపథ్యంలో, దీన్ని తిప్పికొట్టాలని అధికారపక్షం ఎన్‌డీఏ సిద్ధమవుతోంది. ఈనెల 21న అత్యంత కీలకమైన పార్లమెంటరీ సమావేశం నిర్వహించనుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల (జూలై 20 నుంచి ఆగస్టు 13) సందర్భంగా ఈ భేటీ జరగనుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మోదీ ప్రభుత్వం తన శాసన, పరిపాలనాపరమైన ఎజెండాను నిర్దేశించడానికి ఎన్‌డీఏ సమావేశం దోహదం చేయనుంది. జోరుగా ప్రచారం సాగుతోన్న కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం కూడా ఈ ఎజెండాలో అన్నింటి కంటే ముఖ్యంగా ఉంటుందనే ఊహాగానాలు సాగుతున్నాయి. ప్రతిపక్ష పార?టల్లో ఇటీవల వచ్చిన చీలికలు, పెరిగిన సంఖ్యాబలం నేపథ్యంలో తమ ప్రతిష్టాత్మక బిల్లులను ఆమోదింపజేసుకోవడమే లక్ష్యంగా ఎన్‌డీఏ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ సన్నద్ధతలో భాగంగానే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈనెల 17న ఎన్‌డీఏ మంత్రుల వ్యూహాత్మక సమావేశం జరగనుంది. అలాగే, 19వ తేదీన అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నారు.

**ఆ బిల్లును గట్టెక్కించేందుకు..**

ఏప్రిల్ జరిగిన బడ్జెట్ సమావేశాల్లో మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోవడంతో వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు (నియోజకవర్గాల పునరి?వభజన, మహిళా రిజర్వేషన్ల బిల్లు)ను కొన్ని మార్పులతో తిరిగి ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. లోక్‌సభ స్థానాల సంఖ్యను దాదాపు 850కి పెంచడం, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచేలా ప్రతిపాదన తేవడం ద్వారా ప్రాంతీయ పార?టల మద్దతు కూడగట్టాలని భావిస్తోంది. ఇటీవల టీఎంసీలోని 20 మంది ఎంపీలు నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)గా చీలిపోయి ఎన్‌డీఏకి మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే శివసేన (యూబీటీ) నుంచి ఆరుగురు లోక్‌సభ ఎంపీలు షిండే వర్గంలో చేరారు. రాజ్యసభలో ముగ్గురు టీఎంసీ ఎంపీలు, ఏడుగురు ఆప్ ఎంపీలు బీజేపీలోకి చేరారు. ఈ కొత్త సమీకరణలతో పార్లమెంటు ఉభయ సభలలో బలం పుంజుకున్న ఎన్‌డీఏ ఈసారి 131వ రాజ్యాంగ సవరణ బిల్లును గట్టెక్కించాలని చూస్తోంది.

## రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

జరిగాయని విమర్శించారు. తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకోవడానికి ప్రత్యేకంగా జీవోలు తెచ్చి... ఆ పని పూర్తికాగానే జీవోలను రద్దు చేశారన్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు సైతం వారి చేతుల్లోనే ఉన్నాయని, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జూడో సంఘానికి నారా లోకేశ్ తోడల్లుడు భరత్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా దోచిపెడుతున్నారని జగన్ మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణంలో చదరపు అడుగుకు రూ. 20,000 పైనే ఖర్చు చూపిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ చేస్తున్నారని, భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు ఒప్పుకోని రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 5,000 కోట్ల విలువతో నిర్మితమైన రామాయపట్నం పోర్టును కేవలం రూ. 1,500 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పెద్ద కుంభకోణం కాదా? ఇలాంటి ఆదాయ వనరులను ప్రైవేటుకు ఇస్తే రాష్ట్రానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది?" అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అప్పులు చేయడంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ధ్వజమెత్తారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిమితులను సైతం ఉల్లంఘించి గత రెండేళ్లలోనే రూ. 3.6 లక్షల కోట్ల భారీ అప్పులు చేశారని ఆరోపించారు. ఇంత అప్పు తెచ్చినా... ప్రజలకు, రాష్ట్రానికి చేసింది మాత్రం శూన్యమని విమర్శించారు. ఇసుక, మైన్స్, లిక్కర్ ఇలా ప్రతి రంగంలోనూ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు.

## బాబు రాష్ట్రానికి క్యాన్సర్ గడ్డ.. జగన్ రాయలసీమ రత్నం

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దగా చేస్తోందని... చంద్రబాబు, లోకేశ్ వైసీపీ అధినేత జగన్ ను విమర్శించడమే ఏకైక పనిగా పెట్టుకున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. లోకేశ్ కడప జిల్లా పర్యటన వల్ల ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదని, కేవలం జగన్‌పై నిందలు వేయడానికే ఆయన వచ్చారని విమర్శించారు. వివేకా హత్య కేసులో జగన్‌కు ఎలాంటి సంబంధం లేదని సీబీఐ, సుప్రీం కోర్టు స్పష్టం చేసినా... కూటమి నేతలు ఇంకా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఈ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ గడ్డ అని.. జగన్ రాయలసీమ రత్నం అని వ్యాఖ్యానించారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు రైతు ద్రోహి అని రాచమల్లు విమర్శించారు. ఆర్‌బీకేలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీలతో రైతులకు తోడ్పాటు అందించిన జగన్ వ్యవసాయాన్ని పండుగ చేసిన నాయకుడని కొనియాడారు. అమరావతిలో రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. జగన్ హయాంలో నిర్మించిన స్కూళ్లను చూపిస్తూ లోకేశ్ షోకులు పడుతున్నారని, 18 మెడికల్ కాలేజీలను పూర్తి చేయలేక కూటమి సర్కార్ చేతులెత్తేసిందని విమర్శించారు.

## కెమికల్ కంపెనీలో విష వాయువు పీల్చి కార్మికుడి మృతి

- రియాక్టర్ వద్ద పని చేస్తుండగా ఘటన.. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని ఓ రసాయన పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు రియాక్టర్ వద్ద పని చేస్తుండగా విష వాయువు పీల్చి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన పాలమూరు కృష్ణారెడ్డి (43) హయత్‌నగర్‌లో నివాసం ఉంటూ, దోతిగూడెం శివారులోని హెజిలో ఫార్మా కంపెనీలో కెమిస్ట్‌గా (షిఫ్ట్ ఇన్‌చార్జిగా) పనిచేస్తున్నాడు. గురువారం కొత్త ఉత్పత్తి బ్యాచ్ ఏర్పాటులో భాగంగా రియాక్టర్‌ను సిద్ధం చేసే పనులు నిర్వహిస్తుండగా, అందులోని విష వాయువును పీల్చడంతో ఒక్కసారిగా స్పృహ తప్పి కుప్పకూలినట్లు సమాచారం. సహచర కార్మికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, మార్గమధ్యలోనే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు.

**కంపెనీ యాజమాన్యంపై ఆరోపణలు:**

ఘటన అనంతరం మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్‌కు తరలించి విషయం గోప్యంగా ఉంచేందుకు కంపెనీ యాజమాన్యం ప్రయత్నించిందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలపై అధికారికంగా పోలీసులు లేదా సంబంధిత కంపెనీ యాజమాన్యం నుంచి ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. పోలీసుల దర్యాప్తు అనంతరం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



## చీకట్లలో తెలంగాణ.. కమీషన్లలో కాంగ్రెస్: హరీశ్‌రావు

హైదరాబాద్: బొగ్గు, నీటి నిర్వహణలో దూరదృష్టి లేని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలు పెరిగాయని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో మొత్తం 23 వేల మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం, థర్మల్ సామర్థ్యం 7,180 మెగావాట్లు ఉన్నప్పటికీ కేవలం 3,190 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే జరిగిందన్నారు. థర్మల్ విద్యుత్ సామర్థ్యంలో కేవలం 44 శాతం సామర్థ్యాన్నే వినియోగిస్తున్నారని చెప్పారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కొత్తగూడెం, కాకతీయ, భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాల్లో 6--7 రోజులకు మించి బొగ్గు నిల్వలు లేవని, యాదాద్రి ప్లాంట్‌లో రెండు యూనిట్లు, భద్రాద్రి ప్లాంట్‌లో నిర్వహణ లోపాలతో ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. రాష్ట్రంలోని రిజర్వాయర్ల మొత్తం నిల్వ సామర్థ్యం



1,059 టీఎంసీలు కాగా ప్రస్తుతం కేవలం 351 టీఎంసీలే నీరు ఉందని, హైడల్ విద్యుత్‌కు నీళ్లు, థర్మల్ విద్యుత్‌కు బొగ్గు లేదన్నారు. సింగరేణి వెబ్‌సైట్‌ను మూసివేసి బొగ్గు ఉత్పత్తి, సరఫరా వివరాలను దాచిపెడుతోందన్నారు. బొగ్గు, ఇసుక, విద్యుత్, భూముల్లో కుంభకోణాలకు పాల్పడుతూ కాంగ్రెస్ పాలన స్కామ్‌ల మయంగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టామన్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మళ్లీ చీకట్లలోకి నెడుతోందని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఎరువుల సరఫరా, పంట బోనస్, విద్యుత్ సరఫరా అన్నింటిలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇది 'కోతలు.. వాతల సర్కారు'గా ఆయన అభివర్ణించారు. గ్రీన్ ఎనర్జీ పాలసీ కింద 3 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం వెనుక కమీషన్ల కక్కుర్తే కారణమన్నారు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచి, ప్లాంట్లకు తగిన బొగ్గు సరఫరా చేసి, రైతులకు 24 గంటల విద్యుత్ అందించకుంటే రైతాంగం తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, తలసాని, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, ఉద్యోగ సంఘాల నేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు.



# సిబ్బందికి యూనిఫామ్‌లు, భద్రతా సామగ్రి అందజేత

- పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం
- గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలంలోని దూది వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం యూనిఫామ్‌లు, గ్లౌజులు, మాస్కులు, రైన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్, ఉపసర్పంచ్ యేసు, పాలకవర్గ సభ్యులు పాల్గొని సిబ్బందికి సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నడిమింటి నరేష్ మాట్లాడుతూ.. గ్రామ పరిశుభ్రత పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజారోగ్యం కోసం నిరంతరం సేవలందిస్తున్న సిబ్బంది ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని యూనిఫామ్‌లతో పాటు అవసరమైన భద్రతా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో సిబ్బంది తప్పనిసరిగా యూనిఫామ్‌లు, గ్లౌజులు, మాస్కులు ధరించి భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామపంచాయతీ సూచనలు పాటించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కొరడా

- ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు




**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. రాజాపేట ఎస్ఐ లింగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం వేకువజామున నిర్వహించిన వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్ సందర్భంగా ఈ చర్య చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ అక్రమంగా ఇసుకను తరలిస్తూ రాజాపేట మండలంలోని బొందుగుల గ్రామం వైపు వెళ్తుండగా అనుమానం రావడంతో తనిఖీ చేశారు. తనిఖీల్లో ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని రాజాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై సంబంధిత నిబంధనల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమతులు లేకుండా ఇసుక తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రాజాపేటను ప్రగతి పథంలో నిలపాలి

- మండల పరిషత్ కార్యాలయంలో శాఖల వారీగా సుదీర్ఘ సమీక్ష
- హాజరైన ప్రత్యేక అధికారులు దేవ్ సింగ్, నాగిరెడ్డి
- ప్రభుత్వ పథకాల అమలుపై ఉద్యోగులకు దిశానిర్దేశం

**తొలివెలుగు, రాజాపేట :** ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగులు నిరంతరం శ్రమిస్తూ రాజాపేట మండలాన్ని ప్రగతి పథంలో ముందంజలో ఉంచాలని మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బి.దేవ్ సింగ్, మండల క్లస్టర్ ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఓ టి.నాగిరెడ్డి సూచించారు. గురువారం రాజాపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కే.నాగవేణి సమక్షంలో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ (ఉపాధి హామీ) సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లతో కలిసి వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్జెక్టుల వారీగా ప్రత్యేకంగా సమీక్షించారు. ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రజా పరిషత్ పర్యవేక్షకులు అల్లం ఇన్న రెడ్డి, మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) ఆవుల కిషన్, మండల హౌసింగ్ ఏఈ వి.వివేకానంద గౌడ్, వివిధ శాఖల ఏఈలు, మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రాచీన శివాలయ పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ సహకారం

- రఘునాథపురం ఆలయాన్ని సందర్శించిన స్థపతి కె.వెంకటేశ్వర్లు
- నిర్మాణ పనులకు అంచనాలు, ప్లానింగ్ రూపకల్పన
- సీజీఎస్ నిధుల విడుదలకు కృషి చేస్తామని హామీ



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల పరిధిలోని రఘునాథపురం గ్రామంలో సుమారు 200 సంవత్సరాల క్రితం నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి సహిత శివాలయ పునర్నిర్మాణ పనులకు దేవాదాయ శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని ఆ శాఖ ఏఈ, స్థపతి కె.వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా గురువారం ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్, ప్రాథమిక అంచనా విలువలను స్థానిక కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా స్థపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎంతో పురాతన చరిత్ర కలిగిన ఈ శివాలయ పునర్నిర్మాణానికి కామన్ గుడ్ ఫండ్ (సీజీఎస్) ద్వారా నిధులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. గ్రామ సర్పంచ్, ఆలయ ట్రస్ట్ చైర్మన్ పల్లె సంతోష్ గౌడ్ మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ అధికారుల మార్గదర్శకత్వంలో, దాతల ఆర్థిక సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులను అత్యంత త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచకొండ స్వామి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బింగి బాలరాజు, ఆలయ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు బొడ్డుల వెంకటేశం, కోశాధికారి కటకం చిన్న వెంకటేశం, ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి శ్రీధర్, కార్యదర్శి పొట్టబత్తిని మల్లికార్జున్, సహాయ కార్యదర్శి లోక శ్రీశైలం పాల్గొన్నారు. అలాగే గౌరవ సలహాదారులు చంద్రశేఖర్ శర్మ, చింతపండు శ్రీధర్, కానుగంటి శ్రీనివాస్ రెడ్డి, ధర్మకర్తలు కలకుంట్ల పోచయ్య, బందెల యాదగిరి, కుందనపల్లి నర్సింలు, కటకం నాగభూషణం, బత్తెం సిద్ధిరాములు, ఎక్స్ అఫీషియో సభ్యులు కటకం సంతోష్, మ్యాక ఐలయ్య, వడ్లకొండ రమేష్, వార్డు సభ్యులు అక్షయ్ కుమార్, వలబోజు అఖిల్, గ్రామ శాఖ అధ్యక్షులు కొండం రాజు, బొడ్డుల శ్రీకాంత్, మార్క శివ గౌడ్, నీల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నిష్పాక్షికంగా సేవ చేయాలి

- రేణికుంట పీఏసీఎస్ ప్రథమ పాలకమండలి సమావేశం
- నాలుగు గ్రామాల్లో కొత్తగా యూరియా కేంద్రాలు: చైర్మన్ మహేందర్ గౌడ్
- హాజరైన జిల్లా సహకార అధికారి నాగార్జున



**తొలివెలుగు, రాజాపేట :** సహకార సంఘం పరిధిలోని రైతులకు ఎలాంటి పక్షపాతం లేకుండా, నిష్పాక్షితంగా సేవ చేయడమే లక్ష్యంగా పాలకమండలి సభ్యులు పనిచేయాలని రేణికుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం రేణికుంట పీఏసీఎస్ నూతన పాలకమండలి మొదటి సమావేశం చైర్మన్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సహకార అధికారి (డీసీఓ) నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. వానాకాలం సాగు వేళ రైతులకు అవసరమైన యూరియా, 20-20, 28-28 వంటి రసాయన ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల కొరతపై రైతులు ఎలాంటి అయోమయానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. రైతుల సౌకర్యార్థం మండలంలో కొత్తగా నాలుగు యూరియా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పాముకుంట, బొందుగుల, కాల్వపల్లి, చల్లూరు గ్రామాలలో ఈ నూతన కేంద్రాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. అనంతరం సమావేశానికి విచ్చేసిన డీసీఓ నాగార్జునను పాలకమండలి సభ్యులు చేనేత శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, పీఏసీఎస్ సీఈఓ సిల్వేరు చంద్రశేఖర్ గౌడ్, సంఘం డైరెక్టర్లు, నాయకులు రేగు సిద్ధులు, రఘునాథపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ మహిళా నేతపై అనాగరిక దూషణలా

- అగ్రవర్ణ నేతలకు కుల అహంకారం తలకెక్కింది: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- శివ చరణ్ రెడ్డి ఆడియో వివాదంపై తీవ్ర ఆగ్రహం
- యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మకు బీఆర్ఎస్ శ్రేణుల సంఘీభావం



**తొలివెలుగు, ఎల్బీనగర్ :** యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్‌రెడ్డి చేసినట్లు ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలు, ఆడియో వివాదం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి విరసనోళ్ల శ్రీనివాస్ గౌడ్ గురువారం ఎల్బీనగర్‌లోని చింతలకుంట ప్రాంతంలో ఈశ్వరమ్మ యాదవ్ నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. జరిగిన పరిణామాలపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమెకు ధైర్యం చెప్పారు. బీసీ సమాజం మొత్తం ఆమెకు అండగా ఉంటుందని పేర్కొంటూ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని ఈశ్వరమ్మకు మద్దతు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.

**"బీసీలను అవమానించడం సహించం":**

రాజకీయాల్లో అధికార బలం ఉందనే భావనతో బీసీ నాయకులను అవమానించే ప్రయత్నాలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. దశాబ్దాలుగా ప్రజా జీవితంలో సేవలందిస్తున్న ఒక మహిళా నాయకురాలిని గౌరవించలేని వారు ప్రజాస్వామ్య రాజకీయాల్లో కొనసాగడం దురదృష్టకరమని అన్నారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే వారు ఆచరణలో మాత్రం బీసీలను కించపరచడం సరికాదని వ్యాఖ్యానించారు.

**"తంగేడు పూల వనంలో ముళ్లకంచెలా వ్యవహరిస్తున్నారు":**

రాష్ట్రంలో కొందరు అగ్రవర్ణ నాయకుల్లో కుల అహంకారం స్పష్టంగా కనిపిస్తోందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. "తంగేడు పూల వనంలో ముళ్లకంచె వేసినట్లుగా వారి వ్యవహార శైలి ఉంది. పదవులు ఎవరికీ శాశ్వతం కావు. వయసు, అనుభవం, సీనియారిటీకి గౌరవం ఇవ్వకుండా ఒక మహిళా నాయకురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరం" అని అన్నారు.

**ఆడియో వివాదంపై బహిరంగ క్షమాపణ చెప్పాలి:**

శివ చరణ్‌రెడ్డికి సంబంధించినట్లు ప్రచారంలో ఉన్న ఆడియో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిందని పేర్కొన్న శ్రీనివాస్ గౌడ్, దీనిపై ఆయన ప్రజల ముందుకు వచ్చి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆ వ్యాఖ్యలు చేసినట్లయితే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అన్నారు. మహిళలను, ముఖ్యంగా బీసీ మహిళా నాయకులను అవమానించే సంస్కృతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

**నిష్పక్షపాత విచారణ జరపాలి:**


ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, పోలీస్ శాఖ ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ మహిళపై జరిగిన ఈ వ్యవహారాన్ని తేలికగా తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు.

**బీఆర్ఎస్ శ్రేణుల సంఘీభావం:**

ఈశ్వరమ్మ యాదవ్‌కు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. బీసీ సమాజ గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మహిళల పట్ల గౌరవం, బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని వారు పేర్కొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## నూతన తహసీల్దార్ రవి కిరణ్‌కు ఘన సత్కారం

- మర్యాదపూర్వకంగా కలిసిన పద్మశాలి సంఘం నేతలు
- యాదాద్రి స్వామివారి మహాప్రసాదం అందజేత

**తొలివెలుగు, రాజాపేట:** రాజపేట మండలం నూతన తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన గోలి రవి కిరణ్‌ను గురువారం పద్మశాలి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు, రఘునాథపురం మాజీ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్ కుమార్ నేత, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సామల భాస్కర్ నేతలు నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవి కిరణ్‌ను వారు చేనేత శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి మహాప్రసాదాన్ని అందజేసి, మండల అభివృద్ధిలో తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేకే కమిటీ సమావేశానికి ఉద్యమకారులు తరలిరావాలి

- నేడు హైదరాబాద్ అమర జ్యోతి భవనంలో భేటీ
- సలహాలు, సూచనలు ఇవ్వాలని రాజాపేట నేతల పిలుపు



**తొలివెలుగు, రాజాపేట:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకే కమిటీ సమావేశానికి ఉద్యమకారులు భారీ సంఖ్యలో తరలిరావాలని రాజాపేట మండల తెలంగాణ ఉద్యమకారుల కమిటీ మాజీ అధ్యక్షుడు మారోజు కుమారస్వామి, మాజీ ఉపాధ్యక్షుడు పెంట సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం రాజాపేటలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17న (శుక్రవారం) హైదరాబాద్ సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అమర జ్యోతి భవనంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన ఉద్యమకారులతో కేకే కమిటీ బృందం ప్రత్యేకంగా సమావేశం కానుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై కమిటీకి విలువైన సలహాలు, సూచనలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని రాజాపేట మండలంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఉద్యమకారులు అధిక సంఖ్యలో ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ఊట్కూరి అశోక్ గౌడ్, చింతల దాసు, కర్రే చంద్రమౌళి, ఉచింతల బాలయ్య, వేముల గోపి, రామ్ గళ్ళ శ్రీను, తునికి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విద్యుత్ కోతలను నివారించాలి

- 18 గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలి
- వర్కట్‌పల్లి సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం నిరసన
- ఆందోళనలో బోర్లపై ఆధారపడిన రైతాంగం

**తొలివెలుగు, వలిగొండ:** కరువు పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే విద్యుత్ కోతలను నివారించాలని, ప్రతిరోజు 18 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను అందించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. కరెంట్ కోతలకు వ్యతిరేకంగా గురువారం మండల పరిధిలోని వర్కట్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. ఒకవైపు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక, మరోవైపు మూసి కాలువల ద్వారా నీరు విడుదల కాకపోవడంతో భూగర్భ జలాలు భారీగా పడిపోయాయన్నారు. బోర్లలో నీటి మట్టం తగ్గి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో, రోజుకు రెండు మూడు గంటలు కూడా నిరంతరాయంగా విద్యుత్ అందించకపోవడం దారుణమన్నారు. కరెంట్ లేక బోర్లపై ఆధారపడి సాగు చేసిన పంట పొలాలు కళ్లముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి అదనపు విద్యుత్‌ను కేటాయించాలని, కోతలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి, మెట్టు రవీందర్ రెడ్డి, చేగురి నరసింహ, ఆకుల మారయ్య, మాడుగుల వెంకటేశం, రోండి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## దశాబ్దాల కల సాకారం.. సంగెం హైలెవల్ బ్రిడ్జి పనులకు శ్రీకారం





- మూసి నదిపై రూ.50 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభం
- భీమలింగం కట్ట వద్ద ప్రత్యేక పూజల అనంతరం పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అధికారిక శంకుస్థాపన
- నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ మండలం సంగెం-బోలేపల్లి గ్రామాల మధ్య మూసి నదిపై నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి పనులు గురువారం ప్రారంభమయ్యాయి. సుమారు రూ.50 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భీమలింగం కట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న సంగెం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన అనంతరం సంగెం, బోలేపల్లి గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అన్ని కాలాల్లో సురక్షితమైన రాకపోకలు సాధ్యమవుతాయని చెప్పారు. వర్షాకాలంలో మూసి నది ఉధృతంగా ప్రవహించే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని, రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేశారని, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవతో పనులు వేగంగా ప్రారంభమయ్యేలా సహకరించారని ఎమ్మెల్యే తెలిపారు. వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. హైలెవల్ బ్రిడ్జి అధికారిక శంకుస్థాపన కార్యక్రమాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ సరితారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీఐటీయూ రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలి



- కార్మికులకు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ పిలుపు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలపై విమర్శలు

**తొలివెలుగు, వలిగొండ :** ఆగస్టు 16, 17, 18 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సమావేశాలను కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ పిలుపునిచ్చారు. గురువారం వలిగొండ మండలం దుప్పెల్లి గ్రామంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో రాష్ట్ర సమావేశాల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ మార్పులు కార్మికుల కంటే కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులు, యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల సవరణకు సంబంధించి జీఓ ఎంఎస్ నెం.6ను జారీ చేసి, జూన్ 1 నుంచి పెరిగిన వేతనాలు అమల్లోకి వస్తాయని ప్రకటించినప్పటికీ, వేతనాల సవరణ శాస్త్రీయంగా లేదని ఆయన పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచలేదని, రాష్ట్రాన్ని మూడు జోన్లుగా, కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించి వేర్వేరు వేతనాలు నిర్ణయించడం సరైన విధానం కాదన్నారు. శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాలను సవరించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు తప్పనిసరి చేసిన హెల్త్ టెస్టులను రద్దు చేయాలని, ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించిన సంక్షేమ పథకాలను ఉపసంహరించుకోవాలని, హమాలీల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాధారపు మల్లేశ్, కిష్టయ్య, శ్రీను, నర్సింహా, రాములు, మహేష్, రాజు, విజయ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



## వర్కట్‌పల్లి పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- ఆసుపత్రిని పరిశీలించిన సీపీఎం బృందం
- రెండో మెడికల్ ఆఫీసర్‌ను నియమించాలి: సిర్పంగి స్వామి
- 15 గ్రామాల ప్రజలకు సేవలు అందుతున్న వైనం

**తొలివెలుగు, వలిగొండ రూరల్:** వలిగొండ మండల పరిధిలోని వర్కట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పీహెచ్‌సీని సందర్శించి ప్రత్యేకంగా సర్వే నిర్వహించారు. ఆసుపత్రిలోని మౌలిక వసతులు, సిబ్బంది కొరతపై ఆరా తీశారు. అనంతరం స్వామి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్, హెల్త్ అసిస్టెంట్, హెల్త్ సూపర్‌వైజర్, డీఈఓ, అటెండర్ వంటి ఎన్నో కీలక పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఎంతో అభివృద్ధి చేస్తున్నామని ఒకవైపు ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో కనీస వసతులు, సిబ్బందిని నియమించకపోవడం సరికాదన్నారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో నాలుగు సబ్ సెంటర్లు, దాదాపు 15 గ్రామాల ప్రజలు నిత్యం వైద్య సేవల కోసం వస్తుంటారని, రోగుల రద్దీ దృష్ట్యా ఇక్కడ రెండో మెడికల్ ఆఫీసర్‌ను కూడా నియమించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గూడూరు బుచ్చిరెడ్డి, మెట్టు రవీందర్ రెడ్డి, చేగురి నరసింహ, ఆకుల మారయ్య, మాడుగుల వెంకటేశం, రోండి మల్లేశం పాల్గొన్నారు.



## వాన దేవుడా కరుణించు.. ఎండిపోతున్న పంటలను రక్షించు!

- రాజాపేటలో మహిళా రైతుల వినూత్న ప్రార్థనలు
- పాటలు పాడుతూ కాముడికి మొక్కులు.. బొడ్రాయికి జలాభిషేకాలు

**తొలివెలుగు, రాజాపేట:** సకాలంలో వర్షాలు కురవక సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో రాజాపేట మండల కేంద్రంలోని ఎనిమిదవ వార్డుకు చెందిన మహిళా రైతులు గురువారం వానల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పచ్చగా పండాలని ఆకాంక్షిస్తూ వాన దేవుడిని వేడుకున్నారు. ఇందులో భాగంగా మహిళలు సాంప్రదాయబద్ధంగా కాముడి చుట్టూ తిరుగుతూ వాన దేవుడిని కరుణించాలంటూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడారు. అనంతరం గ్రామదేవతలతో పాటు గ్రామానికి రక్షగా భావించే బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి, ఘనంగా జలాభిషేకం నిర్వహించారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో చేతికొచ్చే దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని మహిళా రైతులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. వాన దేవుడు కరుణించి త్వరలోనే మంచి వర్షాలు కురుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- రామన్నపేట సుభాష్ సెంటర్‌లో బీసీ విద్యార్థి సంఘం మహాధర్నా
- జీవో నెం.9, ఆర్‌ఆర్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్
- కొద్దిసేపు పోలీసులతో వాగ్వాదం.. నిలిచిన రాకపోకలు



**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, విద్యార్థి వ్యతిరేక జీవో నెం.9, వివాదాస్పద ఆర్‌ఆర్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రామన్నపేట సుభాష్ సెంటర్‌లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భారీ మహాధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిపై బైఠాయించిన విద్యార్థి నేతలను నిలువరించే క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య కొద్దిసేపు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ?బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ పిలుపు మేరకు జరిగిన ఈ ఆందోళనలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం నాయకుడు అక్కినపల్లి సైదులు, బీజేపీ కార్యవర్గ సభ్యుడు పల్లపు దుర్గయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని, దీనివల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో ఫీజులు అందకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని మండిపడ్డారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ చదివే ప్రతీ పేద విద్యార్థి పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. అలాగే సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, నిరుద్యోగ యువతకు న్యాయం చేసేలా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఊరెళ్ల మహేష్, ఎడ్ల మహాలింగం, జినుకల కృష్ణ, మనీష్, అనిత, లింగస్వామి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం.. ఆహ్లాదకర వాతావరణం ఉండాలి

- మోత్కూర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- వార్డుల్లో అపరిశుభ్రతపై ఆగ్రహం.. సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసులు
- గర్భిణుల వివరాలను ఈ-ఆరోగ్యం యాప్‌లో నమోదు చేయాలని ఆదేశం





**తొలివెలుగు, మోత్కూర్/ యాదాద్రిభువనగిరి:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు ఆసుపత్రిలో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. గురువారం ఆయన మోత్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్.. వైద్య సేవలు, పరిశుభ్రత, రోగులకు అందుతున్న సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**సూపర్‌వైజర్‌పై ఆగ్రహం..**

తనిఖీల్లో భాగంగా కలెక్టర్ ముందుగా ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించారు. వార్డుల్లోని బెడ్‌లపై దుప్పట్లు (బెడ్‌షీట్లు) మురికిగా, సరిగ్గా లేకపోవడాన్ని గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకుగాను సంబంధిత సూపర్‌వైజర్‌కు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. "బెడ్‌షీట్లే అపరిశుభ్రంగా ఉంటే రోగులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు ఎలా వస్తారు?" అని వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు ఎల్లప్పుడూ అద్దంలా మెరిసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**డిజిటల్ నమోదు పక్కాగా ఉండాలి..**

ఆసుపత్రికి ప్రతిరోజూ ఎంతమంది ఓపీ రోగులు వస్తున్నారు? వారికి ఏయే మందులు ఇస్తున్నారు? రక్త పరీక్షలు తదితర ల్యాబ్ నిర్ధారణ పరీక్షలు సక్రమంగా చేస్తున్నారా? అని అధికారులను ఆరా తీశారు. రోగుల వివరాలు, చికిత్స, పరీక్షల సమాచారాన్ని 'ఈ–ఆరోగ్యం' యాప్‌లో సకాలంలో నమోదు చేయాలని, ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో నవీకరించాలని ఆదేశించారు. ఈ నెలలో ఆసుపత్రి పరిధిలో ఎన్ని ప్రసవాలు (ఈడీడీలు) ఉన్నాయి? గర్భిణీలను ఏ విధంగా ట్రాక్ చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు, అత్యవసర వైద్య సేవలు, అవసరమైన మందులు, ల్యాబ్ సౌకర్యాలు అన్నీ అందుబాటులో ఉన్నందున, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న మంచి నీటి ట్యాంక్ వద్ద నీరు వృధాగా నిలిచి ఉండటాన్ని గమనించిన కలెక్టర్.. వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేశారు. ఆసుపత్రి పరిసరాలను, వాటర్ ట్యాంక్‌ను తక్షణమే శుభ్రం చేయించి వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రత్యర్థిని ఇరికించేందుకు కిడ్నాప్ డ్రామా!

- కౌలు భూమి వివాదమే కారణం
- పోలీసులను తప్పుదోవ పట్టించిన శేఖర్‌పై కేసు నమోదు
- సీసీటీవీ ఫుటేజీ, కాల్ డేటాతో అసలు నిజం వెలికితీసిన నిడమానూరు పోలీసులు

**తొలివెలుగు, నిడమానూరు:** ప్రత్యర్థిని తప్పుడు కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో ఓ వ్యక్తి కిడ్నాప్ నాటకం ఆడిన ఘటనను నిడమానూరు పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. కౌలు భూమి వివాదం నేపథ్యంలో పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు నిడమానూరు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉట్కూర్ గ్రామానికి చెందిన బొల్లేపల్లి శేఖర్ (తండ్రి పెద్ద రామయ్య)కు, అదే గ్రామానికి చెందిన బత్తిని వెంకులయ్య (వెంకన్న)కు అనుముల గ్రామ పరిధిలోని 20 ఎకరాల కౌలు భూమి విషయంలో గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదు. ఈ నేపథ్యంలో వెంకన్నను ఇబ్బందుల్లోకి నెట్టాలనే ఉద్దేశంతో శేఖర్ కిడ్నాప్ నాటకానికి తెరలేపినట్లు పోలీసులు తెలిపారు.

**డయల్-100కు తప్పుడు సమాచారం:**

ఈ నెల 14వ తేదీ రాత్రి 7.57 గంటలకు ఉట్కూర్ వెళ్లే మార్గంలో తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి డయల్-100కు ఫోన్ చేసిన శేఖర్, కొందరు వ్యక్తులు కారులో తనను వెంబడిస్తున్నారని తప్పుడు సమాచారం ఇచ్చాడు. అనంతరం తన అన్న కుమారుడు మణికంఠకు కూడా ఇదే విషయం చెప్పి, మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి దూరంగా పడేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిడమానూరు పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్ 137(2) కింద కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**సీసీటీవీ, కాల్ డేటాతో బయటపడిన నిజం:**

దర్యాప్తులో భాగంగా హాలియా, నల్గొండ, చెరువుగట్టు ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలతో పాటు కాల్ డేటాను పోలీసులు విశ్లేషించారు. హాలియాలో కిరాణా సామాను కొనుగోలు చేసిన శేఖర్, 14 మైలు చెక్‌పోస్ట్ వద్ద కర్చీఫ్, టోపీ కొనుగోలు చేసి తన ముఖాన్ని కప్పుకుని బస్సులో నల్గొండకు వెళ్లినట్లు గుర్తించారు. రాత్రి 9.18 గంటల నుంచి 10.20 గంటల వరకు నల్గొండ బస్టాండ్‌లో సంచరించిన దృశ్యాలు సీసీటీవీల్లో నమోదయ్యాయి. అనంతరం చెరువుగట్టు ప్రాంతానికి చేరుకున్న శేఖర్, పరిచయం లేని వ్యక్తి మొబైల్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు కాల్ చేసి, "తనను కిడ్నాప్ చేసిన వారు చెరువుగట్టు సమీపంలో వదిలేశారని" నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు.

**తప్పుడు సమాచారంపై కేసు**

సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలతో వాస్తవాలు వెలుగులోకి రావడంతో, పోలీసులను తప్పుదోవ పట్టించి ప్రత్యర్థిని తప్పుడు కేసులో ఇరికించేందుకు కుట్ర పన్నిన బొల్లేపల్లి శేఖర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు నిడమానూరు ఎస్‌ఐ విజయ్ కుమార్ వెల్లడించారు.



# కేకే కమిటీ సమావేశానికి ఉద్యమకారులు తరలిరావాలి

- నేడు హైదరాబాద్ అమర జ్యోతి భవనంలో భేటీ
- సలహాలు, సూచనలు ఇవ్వాలని ఫోరం నాయకుల పిలుపు
- ఉమ్మడి నల్లగొండ జిల్లా శ్రేణులకు విజ్ఞప్తి

**తొలివెలుగు, రామన్నపేట :** తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కే.కే. కమిటీ సమావేశానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ చాంద్, జిల్లా నాయకులు బొడ్డుపల్లి లింగయ్య, నోముల శంకర్ పిలుపునిచ్చారు. గురువారం వారు రామన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17న (శుక్రవారం) హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న అమర జ్యోతి భవనంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులతో కే.కే. కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల దీర్ఘకాలిక సమస్యలు, వారి ఆకాంక్షలు, విలువైన సూచనలను కమిటీ సభ్యుల దృష్టికి నేరుగా తీసుకెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ భేటీని విజయవంతం చేయాలని కోరారు.

# సిరిపురంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ పరిశీలన

- సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి, సీఎస్ఐఆర్ శాస్త్రవేత్తలు
- చేనేత రంగుల నీరు, డ్రైనేజీ వ్యర్థాల శుద్ధి ప్రక్రియ పరిశీలన
- త్వరలోనే గ్రామపంచాయతీకి అప్పగింత



**తొలివెలుగు, రామన్నపేట రూరల్:** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీ ఎస్ టీ) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్‌ను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ఐఆర్ శాస్త్రవేత్తల బృందం గురువారం సందర్శించింది. చేనేత రంగుల అద్దకం నీటితో పాటు డ్రైనేజీ మురుగునీటిని శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి, నిత్యం గృహ అవసరాలకు వినియోగించేలా రూపొందించిన ఈ ఫిల్టర్ ప్లాంట్ సాంకేతికతను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ పనితీరు, నీటి శుద్ధి సామర్థ్యం, సాంకేతిక అంశాలపై శాస్త్రవేత్తలు స్థానిక అధికారులకు వివరాలు వెల్లడించారు. ప్లాంట్ నిర్వహణను త్వరలోనే గ్రామపంచాయతీకి అప్పగించే ప్రక్రియపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ ఎం. అనూష రమేష్, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మి నర్సు, మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఆ. రాములు, డివిజన్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) ప్రతాప్ నాయక్, చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు, సభ్యులు, వార్డు సభ్యులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

- తుమ్మలగూడెం సమీపంలో ప్రమాదం
- ఇంటికి తిరిగివస్తుండగా బలితీసుకున్న వేగం
- రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మలగూడెం గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలగూడెం గ్రామానికి చెందిన చిన్నలచ్చి సాయిలు (69), గురువారం రాత్రి తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో చిట్యాల వైపు నుంచి భువనగిరి వైపునకు అతివేగంగా, నిర్లక్ష్యంగా దూసుకొచ్చిన లారీ (హెచ్‌ఆర్ 38 డబ్ల్యూ 9712) సాయిలు వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిలు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు పరీక్షించిన వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య చిన్నలచ్చి నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# అయ్యప్ప స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డును వెంటనే రద్దు చేయాలి

- ఆలయం ఎదుట గురుస్వాముల ధర్నా
- అయ్యప్ప భక్త సమాజానికి సమాచారం లేకుండానే ట్రస్ట్ ఏర్పాటు చేశారని ఆరోపణ



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయానికి ఇటీవల ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప భక్త సమాజానికి చెందిన సుమారు 30 మంది గురుస్వాములు గురువారం ఆలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ నిరసనకు మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు సంఘీభావం ప్రకటించారు. అనంతరం గురుస్వాములు సమావేశమై, అయ్యప్ప భక్త సమాజం సభ్యులందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయడం సరికాదని పేర్కొంటూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణం, అభివృద్ధిలో అయ్యప్ప భక్త సమాజానికి చెందిన ప్రతి గురుస్వామి కీలక పాత్ర పోషించారని తెలిపారు. అలాంటి పరిస్థితిలో భక్త సమాజానికి సమాచారం ఇవ్వకుండా, వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. అందరి సమిష్టి నిర్ణయంతో, భక్తుల అభీష్టానికి అనుగుణంగా త్వరలోనే కొత్త కమిటీ ఏర్పాటుకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్త సమాజం అధ్యక్షుడు మెరుగు గోపాల్ యాదవ్, గురుస్వాములు కొయ్యడ శ్రీనివాస్, తండ వెంకటేష్, బోడిగ బాబు, గంగాపురం వెంకటేష్, బడిగ లింగం, రేపాక జగన్, శెట్టి శ్రీనివాస్, అంకం మురళి, కీర్తి సంజీవ్, సబ్బగాని శంకర్, ఆడపు అరవింద్, కోసిన వీరేష్, అంకం వినోద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అంతమ్మగూడెంలో కొత్త పరిశ్రమలకు అనుమతులు ఇవ్వొద్దు

- కాలుష్య సమస్యలతో ఇప్పటికే గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని రైతుల ఆందోళన
- హైకోర్టును ఆశ్రయించిన రైతులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం అంతమ్మగూడెం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు అనుమతులు ఇవ్వవద్దని గ్రామ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికే గ్రామ పరిసరాల్లో ఉన్న రసాయన పరిశ్రమల కారణంగా తీవ్ర కాలుష్య సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మరిన్ని పరిశ్రమలకు అనుమతులు ఇస్తే ప్రజల జీవనం మరింత దుర్భరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన రైతు గమ్మి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అంతమ్మగూడెంలో ప్రతిపాదిత సింబయోటిక్ ఆగ్రో ఇండస్ట్రీస్ నిర్మాణానికి సంబంధించి అనుమతులను నిలిపివేయాలని కోరుతూ రైతులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు తదుపరి విచారణను ఆగస్టు 27కు వాయిదా వేసిందని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామంలో ఉన్న రసాయన పరిశ్రమల వల్ల పర్యావరణం, వ్యవసాయం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు తెలిపారు. కాలుష్యంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో కొత్త పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని గ్రామ రైతులు విజ్ఞప్తి చేశారు.



# నూతన ఎంపీడీఓకు ఎస్.లింగోటం గ్రామపంచాయతీలో ఘన స్వాగతం

- గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి
- నర్సరీని పరిశీలించిన అధికారులు
- గామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శ్రీలత, ఏపీఓ ఈశ్వరయ్యలకు ఎస్. లింగోటం గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి విచ్చేసిన అధికారులను సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ, ఉపసర్పంచ్ బాతరాజు ధనుంజయ పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పచ్చదనం, ఉపాధి హామీ పనులు, గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులకు వివరించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులకు సహకారం అందించి, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని సర్పంచ్, ఉపసర్పంచ్ ఎంపీడీఓను కోరారు. అనంతరం ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ ఈశ్వరయ్య గ్రామంలోని నర్సరీని సందర్శించి అక్కడ మొక్కల పెంపకం, నిర్వహణ, సంరక్షణ విధానాలను పరిశీలించారు. మొక్కలను ఆరోగ్యంగా పెంచి గ్రామ హరితహార లక్ష్యాలను విజయవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామంలో పరిశుభ్రత, పచ్చదనం, అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కావ్యారెడ్డి, వార్డు సభ్యులు పిట్టల శోభా సాధానందం, పల్చం శంకరయ్య, ఉప్పు వీరేశం, బాతరాజు లింగస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ కళమ్మతో పాటు గ్రామంలోని ప్రజాప్రతినిధులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

- పేద విద్యార్థులను చదువుకు దూరం చేసేలా రేవంత్ సర్కార్ కుట్ర
- రూ. 10,500 కోట్లకు పైగా పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు
- విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం చౌటుప్పల్ మండల ఎస్ఎఫ్ఐ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 10,500 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్యార్థులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వం నుంచి ఫీజులు రాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు టీసీ, మెమోలు, డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని మండిపడ్డారు. దీనివల్ల విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని, సర్టిఫికెట్లు నిరాకరిస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్, కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఇరిగి వరుణ్ తేజ్, నాయకులు మల్లేష్, అరవింద్, సతీష్, నిఖిల్, మనీ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అయ్యప్ప స్వామి దేవాలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు





- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, మహా పడిపూజ
- వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారి మేలుకొలుపు, గణపతి హోమం, సర్వాభిషేకం, మహాన్నదాన కార్యక్రమాలను నిర్వహించగా, సాయంత్రం స్వామివారి మహా పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు రామచంద్ర ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్త సమాజం ప్రధాన కార్యదర్శి యన్నం శివకుమార్, కోశాధికారి చిలువేరు బాలనరసింహ, సభ్యులు వెంకటేష్, భారత లవ కుమార్, కొట్టం కరుణాకర్ రెడ్డి, అయ్యప్ప భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్‌ను కలిసిన నూతన చేనేత సహకార సంఘం కార్యవర్గం

- చేనేత సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతి
- కలెక్టర్ అనురాగ్ జయంతి, సహాయ సంచాలకుడు శ్రీనివాస్‌కు సన్మానం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి చేనేత సహకార సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్‌ను కూడా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో చేనేత రంగం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన చేనేత కార్మికులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం కల్పిస్తూ, పోచంపల్లి చేనేతకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ప్రభుత్వ సహకారం అందించాలని కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సురపల్లి శ్రీనివాస్, కోశాధికారి కోడి బాలరాజు, సభ్యులు పాలాది జ్యోతి యాదగిరి, మహేశ్వరం నాగమణి, కడవేరు చంద్రమౌళి, గంజి బసవలింగం పాల్గొన్నారు.

# గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి


- బూత్ స్థాయి నాయకులదే కీలక పాత్ర: రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్
- జూలూరులో మండల కార్యవర్గ సమావేశం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** గ్రామీణ స్థాయిలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడంలో బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ అన్నారు. గురువారం భూదాన్ పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి నాయకులతో పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ విస్తరణ, రానున్న ఎన్నికల కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరుతున్నప్పటికీ, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో పార్టీ నాయకులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి బూత్‌లో బలమైన సంస్థాగత నిర్మాణం చేపట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి, జిల్లా అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చెరుకు వెంకటేశం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పల్లెకాడి బసవయ్య, జిల్లా చేనేత సెల్ నాయకుడు గంజి బసవలింగం, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ముద్దం హరీష్, ఉపాధ్యక్షుడు బోదాసు మల్లేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు చంద్రవాస్ యాదవ్, నాయకులు బైర్ వెంకటేశం, బద్దం వెంకటరెడ్డి, కేసారం కృష్ణారెడ్డి, నరసింహ, లింగస్వామి, రమేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- శంషాబాద్ విమానాశ్రయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు
- చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్



**తొలివెలుగు, చౌటుప్పల్ :** మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనయుడు, సుశీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఎండీ కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు శంషాబాద్ విమానాశ్రయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, యువజన కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బనబోయిన రాము యాదవ్, లెంకలపల్లి ఉపసర్పంచ్ మెతరి శంకర్, దాడి యశ్వంత్ రెడ్డి, పున్న మహేష్ తదితరులు కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో, మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తూ నాయకులు శుభాభినందనలు తెలిపారు.